క్లుప్తంగా

ఘనంగా గురజాడ జయంతి



ఉరవకొండ: మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ అరుణజ్యోతి

ఉరవకొండ/కళ్యాణదుర్గం రూరల్: ఉరవకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురుజాడ అప్పారావు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగాధిపతి వి.గోపి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ అరుణజ్యోతిమాట్లాడుతూ గురుజాడ అప్పారావు ఆధునిక సాహిత్యంలో అనేక నాటకాలు, కథానికాలు రచించారన్నారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాజేష్, అధ్యాపకులు కృష్ణవేణి, నారాయణస్వామి, ప్రభాకర్, పీడీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురజాడ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.వి. శేషయ్య, తెలుగు విభాగాధిపతి జ్యోత్స్న, అధ్యాపకుడు ఎం.పరమేష్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే బ్రహ్మసముద్రం మండలంలోని వేపులపర్తి ప్రాథమిక పాఠశాలలో గురజాడ అప్పరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు ఈశ్వరయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

విడపనకల్లు: మండల కేంద్రంలోని సచివాలయం-2ను ఎంపీపీ కరణం పుష్పావతి గురువారం తనిఖీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఆదిశగా సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుండా.. ప్రజలను సచివాలయం చుట్టూ తిప్పుకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాషా, వైఎస్సార్‌సీపీ నాయకుడు భీంరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ బాలకిషన్

బ్రహ్మసముద్రం: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బాలకిషన్, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బాల్య వివాహాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మండలంలో బాల్యవివాహాలు జరిగినట్టు రుజువైతే .. పెళ్లి పెద్దలు , పెళ్లికి హాజరైన వారిపై కూడా కఠిన చర్యలు తప్పవన్నారు. బాల్య వివాహాలు చేయడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. బాలికలను బాగా చదివించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసానాయక్, ఆర్డీటీ ఆదినారాయణ, ఏఓ నందకిశోర్, హెల్త్ సూపర్‌వైజర్ రామలక్ష్మీ, సీఆర్‌పీ బూతన్న, ఐసీడీసీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రూ.39 వేలు పలికిన 'లడ్డూ'



భక్తుడికి లడ్డూ అప్పగిస్తున్న కమిటీ సభ్యులు

ఉరవకొండ: స్థానిక 4వ వార్డు ఉప్పర వీధిలో వినాయక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కొలువు తీరిన వినాయకుడి లడ్డూ రూ.39, 516 పలికింది. గురువారం నిర్వహించిన లడ్డూ వేలంలో కర్నూలు జొమాటో కంపెనీ మేనేజర్ సంప్రీత్ దక్కించుకున్నాడు. అలాగే స్వామి కండువాను రూ.16,116కు ఉప్పర భాగ్యమ్మ కుమారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో విగ్రహ దాత ఉప్పర మధు, కమిటీ సభ్యులు ఉప్పర రాజేష్, అనిల్, మంజునాథ్, వీరేష్ పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ నుంచి వెలిగొండకు వెళ్లే రహదారి పనులను వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డే ఆంజినేయులు, వ్యాసాపురం ఉలిగన్న తదితరులు పరిశీలించారు. వైఎస్ ఎంపీపీ మాట్లాడుతూ వెలిగొండకు వెళ్లేందుకు సరైన రహదారి లేక ప్రజలు అవస్థలు పడేవారన్నారు. సమస్యను మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన స్పందించి అధికారులతో మాట్లాడి ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.1.80 కోట్లు మంజూరు చేయించారన్నారు. పనులు మరో నాలుగు రోజుల్లో పూర్తవుతాయని ఆయన తెలిపారు.

సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ సేవలు

- చిరునామాలో చేర్పులు, మార్పులకు అవకాశం
- వేలిముద్రలు, ఫోన్ నంబర్ల అనుసంధానం
- కార్డు పొంది పదేళ్లయితే అప్‌డేట్ తప్పనిసరి



కణేకల్లు మండలం హులికెర సచివాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గం: ప్రతి పౌరుడికీ ఆధార్ కార్డు అవసరం. ప్రభుత్వం నుంచి పొందే సంక్షేమ పథకాలు, బ్యాంకు ఖాతా, ఆర్థిక లావాదేవీలు, పాస్‌పోర్టు, ఉపాధి కూలీగా నమోదు ఇలా ప్రతి చోటా ఆధార్ నంబర్ ప్రాముఖ్యత ఎంతో విలువైంది. అయితే 2010-2016 మధ్య కాలంలో సరైన ధ్రువీకరణ పత్రాలు లేకున్నా ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టారు. ఈ కారణంగా బోగస్ కార్డులు సృష్టించి పథకాలు కాజేస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తాయి. అలాంటి తప్పిదాలను సరిచేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అడుగులు వేశాయి. ఆధార్ పొందిన ప్రతి ఒక్కరూ సరైన ధ్రువీకరణ పత్రాలు జత చేసి అప్‌డేట్ చేసుకునేలా ఉత్తర్వులు జారీ చేశాయి. లేకపోతే సెప్టెంబర్ తర్వాత కార్డు నెంబర్ నిలిపివేయనున్నాయి.

ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

ప్రజా సంక్షేమం దృష్ట్యా గ్రామ/వార్డు సచివాలయాల్లో ఇప్పటికే 600కు పైగా పౌరసేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆధార్ కేంద్రాలను ఊరూరా నెలకొల్పేలా చర్యలు చేపట్టింది. గత టీడీపీ హయాంలో మండలానికి ఒకటి లేదా నియోజకవర్గానికి రెండు మాత్రమే ఆధార్ కేంద్రాలు ఉండేవి. ఈ కారణంగా చిన్న మార్పునకు సైతం ప్రజలు రోజులు తరబడి చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం అలాంటి ఇబ్బందులను రూపుమాపేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల ముంగిటే ఆధార్ కేంద్రాలు నెలకొల్పేలా శ్రీకారం చుట్టారు. డివిజన్‌లోని రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో 194 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో శాశ్వతంగా 39 ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

1.04 లక్షల మంది సద్వినియోగం

ప్రతి గ్రామంలోనూ ఆధార్ సేవలు వినియోగంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నెలలో మూడు లేదా ఐదు రోజులు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పర్మనెంట్‌గా ఉండే కేంద్రాలను పక్క గ్రామాల్లోకెళ్లి నిర్వహించేలా జాబితా రూపొందించింది. దాని ఆధారంగా ఈ నెల 20 నుంచి 23 వరకూ స్పెషల్ క్యాంపులు చేపట్టారు. రోజుకు 20 నుంచి 25 గ్రామాల్లో ఈ సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. డివిజన్ వ్యాప్తంగా 1.30 లక్షల మంది ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉండగా ఇప్పటికే 1.04 లక్షల మందికి సద్వినియోగం చేసుకున్నారు. సుమారు 26 వేల మంది అప్‌డేట్ పెండింగ్‌లో ఉన్నట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పెండింగ్ జాబితా క్లియర్‌పై ప్రత్యేక దృష్టిసారించారు.

అప్‌డేట్ కోసం ఇలా

- 2010- 2016 మధ్య ఆధార్ తీసుకుని 2016 తర్వాత ఆధార్ పేరు, చిరునామా మార్చుకోని వారు తప్పనసరిగా కార్డును అప్‌డేట్ చేసుకోవాలి.
- 2016 తర్వాత ఫోటో, జనన తేదీని మార్చుకున్నప్పటికీ.. చిరునామా మార్చుకోని వారు డాక్యూమెంట్ అప్‌డేట్ చేసుకోవాలి. లేదంటే కార్డు ఉన్నా సెప్టెంబర్ తర్వాత పనిచేయదు.
- ఆధార్ సస్పెండ్ అయితే ఆధార్ లింక్ అయిన మొత్తం సేవలన్నీ నిలిచిపోతాయి. బ్యాంకింగ్, పోస్టల్, గ్యాస్ తదితర సర్వీసులు ఆగిపోతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందుతున్న అన్నీ సేవలు రద్దవుతాయి.
- ఆధార్ కార్డులో ఉన్న చిరునామా, ప్రస్తుత చిరునామా వేరుగా ఉంటే సరైన ఆధారాలతో చిరునామా అప్‌డేట్ చేయించుకోవాలి.
- వివాహానికి ముందు ఆధార్‌లో మహిళలకు పుట్టింటి ఇంటిపేరు ఉంటుంది. వివాహం తర్వాత భర్త ఇంటి పేరుతో ఆధార్ తీసుకోవాలంటే సబ్ రిజిస్టర్ కార్యాలయం మంజూరు చేసిన మ్యారేజ్ సర్టిఫికేట్ సమర్పించాల్సి ఉంటుంది.

ఊర్లోనే ఆధార్ సేవలు



ఊర్లోనే ఆధార్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో ఆధార్ కార్డుల్లో ఏ చిన్న మార్పుకావాలన్నా మీ-సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సిఫార్సులు, లంచాలు ఇచ్చేవారికే పనులు జరిగేవి. ప్రస్తుతం ఆ విధానాలు మారిపోయాయి. ఊర్లోనే సేవలు అందుతుండడం సంతోషంగా ఉంది.

– తులసి, గృహిణి, కలుగోడు

ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా అందుబాటులోకి తెచ్చిన ప్రత్యేక కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. నెలాఖరులోగా ఆధార్ అప్డేట్ చేసుకోకపోతే కార్డు సస్పెండ్ లిస్టులో ఉండిపోతుంది. ఈ కారణంగా ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ ఇతర ఆర్థిక లావాదేవీలన్ని నిలిచిపోతాయి. ఈ నెల 20 నుంచి 23 వరకు గ్రామాల్లోనే స్పెషల్ డ్రైవ్ చేపట్టాం.

– శంకర్, డీఎల్‌డీఓ, కళ్యాణదుర్గం డివిజన్

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు



రాయదుర్గం టౌన్: గంబూసియా చేపలు వదులుతున్న జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు



కళ్యాణదుర్గం రూరల్: చెరువులో గంబుసియా చేపలు వదులుతున్న అధికారులు

రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గం రూరల్: మలేరియా, డెంగీ వ్యాధుల ప్రబలకుండా దోమల వ్యాప్తి నియంత్రణపై ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గంబూసియా చేపలను నీటి నిల్వలు ఉండే బావులు, చెరువులు, కుంటల్లో వదలుతున్నారు. గురువారం రాయదుర్గం పట్టణంలోని బావులు, కుంటలు, చెరువుల్లో జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు, అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి గంబూసియా చేపలను వదిలారు. పట్టణంలోని ముత్తరాసి కాలనీ, దుగ్గిలమ్మ ఆలయం వద్ద బావుల్లో, 28వ వార్డులోని బాలబావిలో, మొలకాల్మూరు రోడ్డులోని నాన్ చెరువులో, బీటీపీ రోడ్డులోని బావిలో చేపలను వదిలారు. దోమ లార్వాలను నియంత్రించడానికి బయోలాజికల్ ఏజెంట్‌గా గంబూసియా చేపలు దోహదపడుతాయని అధికారులు తెలిపారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించి దోమల నియంత్రణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కళ్యాణదుర్గం పట్టణంలోని ఐదుకల్లు రోడ్డు వద్ద చెరువులోకి శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో దోమల వ్యాప్తి నివారణకు గురువారం గంబూసియా చేపలను వదిలారు కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారులు సత్యనారాయణ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజేష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి తిరుపాలయ్య,సెక్రటరీలు సతీష్ గణేష్, డిఈఓ తిప్పేస్వామి, హెల్త్ అసిస్టెంట్ వీరేశఖర్ పాల్గొన్నారు.

పేదలకు అండగా వైఎస్సార్ బీమా



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న కాపు భారతి

రాయదుర్గంటౌన్: వైఎస్సార్ బీమా పథకం పేదలకు అండగా ఉంటోందని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి అన్నారు. పట్టణంలోని 29వ వార్డు అనారోగ్యంతో నాయకుల గంగాధర్ మృతి చెందాడు. బీమా పథకం కింద రూ.10 వేలు తక్షణ ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు గురువారం సాయంత్రం వార్డు ఇన్‌చార్జ్ వైజాగ్ రిబ్కా, రవి, కౌన్సిలర్ గోవిందరాజుతో కలిసి ఆమె అందజేశారు. ధైర్యంగా ఉండాలని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. బీమా కింద మిగతా రూ.90 వేలు నామినీ ఖాతాకు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఉమాపతి, మురళి, అల్తాఫ్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత

గుమ్మఘట్ట: మండలంలోని కె.పి.దొడ్డి గ్రామానికి చెందిన హరీష్(32) అనారోగ్యంతో మూడు రోజుల క్రితం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ రమేష్ మృతుడి భార్య విశాలక్షికి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చిత్తయ్యతో కలసి అందించారు. మిగిలిన రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు.

తాగునీటి పంపింగ్ వేగవంతం చేయండి



పంపింగ్ పరిశీలిస్తున్న ఎంపీపీ కరణం పుష్పావతి

విడపనకల్లు: విడపనకల్లు సత్యసాయి సమ్మర్ స్టోరేజ్‌లోకి తాగునీటి పంపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఎంపీపీ కరణం పుష్పావతి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. గురువారం సత్యసాయి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులోకి జీబీసీ నుంచి పంపింగ్ చేస్తున్న ప్రక్రియను అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గిందని, అధికారులు తాగునీటి స్టోరేజ్ చేసే ప్రక్రియలో పూర్తి స్థాయిలో పంపింగ్ చేసేలా చూడాలన్నారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అదనంగా 20, 25హెచ్‌పీ నూతన విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేసి మరింత వేగంగా తాగునీటి పంపింగ్‌కు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీపీ తెలిపారు. మండలంలో తాగునీటి సమస్యలు రాకుండా మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు భీంరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు లతీఫ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోపాలకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి

రాయదుర్గంటౌన్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొలువుదీరిన మండపాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వినాయక సర్కిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్కిల్‌లో మహా అన్నదాన ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతితోపాటు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇల్లూరి శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, నేత్రపల్లి కాంతారెడ్డి, పొరాళ్ల శివకుమార్, వాల్మీకి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండి కిష్టప్ప, ఇతర ప్రముఖులు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహా గణపతి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కాపు భారతి కోరారు. దాదాపు పది వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వినాయక అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరసంద్ర మారెమ్మ విగ్రహ ప్రతిష్ట



మారెమ్మ దేవత విగ్రహం

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి గ్రామంలో గురువారం గౌరసంద్ర మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన ఆలయంలో గౌరసంద్ర మారెమ్మ విగ్రహంతో పాటుగా కలశం, త్రిశూల, సింహం, అమ్మవారి పాదాలను ప్రతిష్టించారు. మలయనూరుకు చెందిన లక్ష్మీకాంత్‌శాస్త్రి, దర్శన్‌స్వామి, దిలీప్‌శాస్త్రి తదితర వేదపండితుల బృందం యాగశాల ఏర్పాటు చేసి ఆరాధన, వాస్తు హోమాలు, పూర్ణాహుతి, మంత్ర పుష్పం, కలశ ప్రతిష్ఠ, అమ్మవారి త్రిశూల ప్రతిష్ఠ పూజలను నిర్వహించారు. అమ్మవారి విగ్రహ, సింహ, పాదాల దాతలుగా నారా మహేశ్వరమ్మ, నారా సూర్యనారాయణ దంపతులు, అన్నదాన కార్యక్రమ దాతలుగా లేకిరెడ్డి రామలక్ష్మమ్మ, లేకిరెడ్డి పాపిరెడ్డి కుమారులు జయచంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి వ్యవహరించారు. ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

మద్యం అక్రమ రవాణాపై సెబ్ ఉక్కుపాదం

- పలువురిపై కేసులు నమోదు



పట్టుబడిన మద్యం ప్యాకెట్లను చూపుతున్న సీఐ జయనాథ్‌రెడ్డి

రాయదుర్గం: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం రవాణా చేస్తూ రాయదుర్గం ప్రాంతంలో విక్రయించే వారిపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పోలీసులు ఉక్కుపాదం మోపారు. గురువారం నియోజకవర్గంలోని రంగచేడు, జుంజురంపల్లి గ్రామాల్లో మెరుపుదాడులు నిర్వహించి రామాంజనేయులు వద్ద 146, పాలక్క వద్ద 30 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్టు సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 107 ఎన్‌డీపీఎల్ కేసుల్లో 111 మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 14,033 టెట్రా ప్యాకెట్లు, 40 వాహనాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు 135 మందిని బైండోవర్ చేశామన్నారు. 94 కేసుల్లో వివిధ వాహనాలు వేలం నిర్వహించగా రూ.17,43,800 ప్రభుత్వ ఖజనాకు జమ చేశామన్నారు. మద్యం అక్రమంగా విక్రయించినా, కొన్నా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. రెండు ఆపై కేసులలో పట్టుబడిన వారిపై పీడీ యాక్టు తెరిచి జిల్లా బహిష్కరణ చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ఓంశాంతి నగర్‌లో గురువారం పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు. నిందితుల నుంచి రూ.24,480 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు



ఉద్దేహాళ్‌లో పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్

బొమ్మనహాళ్: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే బహుళ ప్రయోజనాలున్నాయని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ సూచించారు. గురువారం మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ గ్రామాల్లో జరుగుతున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను ఆయన తనిఖీ చేసి, రైతులతో మాట్లాడారు. పంట నమోదుతో బీమాతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు అవుతారన్నారు. రైతులు గ్రామాల్లోని వ్యవసాయ సహాయకులు, సిబ్బందిని కలసి ఈనెల 30లోగా పంట నమోదుతో పాటు ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. యూరియా కొరత రాకుండా ఆర్‌బీకేల ద్వారా ఎమ్మార్పీకే రైతులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సాయికుమార్, టెక్నికల్ ఏఓ అహమ్మద్‌బాషా, ఏఈఓ గోపాల్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్ల గ్రామంలో గురువారం భగవతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ మల్లప్పను కళ్యాణదుర్గం నియోజక వర్గంలోని కురుబ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంబదూరు వైస్ ఎంపీపీ భీమేష్, కైరేవు సర్పంచ్ గంగాధర్, కురుబ సంఘ సభ్యులు ఆర్డీటీ ఎర్రిస్వామి, వన్నూరుస్వామి, సోమశేఖర్ పాల్గొన్నారు.

జోకుమారుడి ఊరేగింపు

ఉరవకొండ: సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ జోకుమారుడి ఉత్సవ మూర్తిని మహిళలు పట్టణంలో ఊరేగిస్తూ బిక్షాటన చేశారు. ఏటా వినాయకచవితి నిమర్జనం ముగిసేలోగా వర్షాలు కురిసేవని, నిమర్జనం ప్రారంభమైనా వాన జాడ లేకపోవడంతో జోకుమారుని ఊరేగింపు నిర్వహించారు.

ఆటో, కారు ఢీ .. ముగ్గురికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటి పరిధిలోని రాయదుర్గం బైపాస్ దగ్గర ఆటో, కారు ఢీ కొని ముగ్గురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. కళ్యాణదుర్గానికి చెందిన ఆటో మల్లికార్జునపల్లి నుంచి వస్తుండగా రాయదుర్గం నుంచి అనంతపురం వైపు వెళుతున్న కారు రాయదుర్గం బైపాస్ దగ్గర ఢీకొన్నాయి. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న మనోహర్, రాజు, అంజికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నగదు రహిత స్కానర్ల పంపిణీ

విడపనకల్లు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సచివాలయాల్లో నగదు రహితానికి సంబంధించి స్కానర్లను అమల్లో తీసుకొని వచ్చిందని ఎంపీపీ కరణం పుష్పావతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి ఆమె నగదు రహిత స్కానర్లను పంపిణీ చేశారు. సచివాలయాల్లో సేవలకు చెల్లించాల్సిన రుసుం నగదు రూపంలో ఇవ్వకుండా స్కానర్లు ద్వారా కూడా చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సత్యబాబు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి

కణేకల్లు: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన రైతు ఆస్పత్రిలో మృతిచెందాడు . పోలీసుల వివరాల మేరకు.. నాగేపల్లి గ్రామానికి చెందిన రైతు బోయ లాలుస్వామి (43) తనకున్న రెండెకరాలతోపాటు మరో 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. మిర్చి, పత్తి తదితర పంటల సాగు కోసం సుమారు రూ.8 లక్షల వరకు అప్పులు చేశాడు. సరైన దిగుబడులు రాక చేసిన అప్పులు తీర్చలేదు. ఈ క్రమంలో అప్పులిచ్చిన వారి వేధింపులు ఎక్కువ కావడంతో ఈనెల 19న పొలంలో పురుగుల మందు తాగాడు. అనంతరం ఇంటికొచ్చి పురుగుల మందు తాగానని భార్య లక్ష్మికి చెప్పాడు. ఆమె వెంటనే స్థానికుల సాయం కణేకల్లు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా డాక్టర్లు ప్రథమ చికిత్స చేసి అనంతపురానికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ లాలుస్వామి బుధవారం మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. కుటుంబీకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ట్రాన్స్‌కో ఏఈ పేరుతో డబ్బు డిమాండ్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) పేరుతో గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న వైనం వెలుగుచూసింది. నెలరోజుల నుంచి పట్టణంలోని ఐదుగురు వ్యక్తులకు తన పేరుతో ఫోన్ కాల్స్ వచ్చినట్లు తెలిసిందని ఏఈ బాలచంద్ర తెలిపారు. నా కుమరుడికి హైదారాబాద్‌లో ఆపరేషన్ చేస్తున్నానని, అర్జెంటుగా డబ్బులు వేయాలని ఫోన్ చేస్తున్నారన్నారు. తన పేరుతో వస్తున్న ఫోన్‌కు ఎవరూ స్పందించరాదన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

'ఆరోగ్య సురక్ష' ద్వారా ఉచిత వైద్యం

కుందుర్పి: ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ ఉచితంగా వైద్య సేవలు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, వైద్యాధికారి నారాయణస్వామి అన్నారు. గురువారం మండలంలోని కరిగానిపల్లిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి, పథకం ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. 45 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో 105 రకాల మందులను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, సచివాలయ కన్వీనర్ రాజన్న, గృహసారథులు నాగరాజు, భీమప్ప, అర్జునప్ప, ప్రతాప్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

కుందుర్పి: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ వెంకటనాయుడు, వైద్యాధికారిణి అనూష, సర్పంచ్ మారుతేశ్వరి అన్నారు.గురువారం స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ, ఆరోగ్య సిబ్బంది కుందుర్పిలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తూ ర్యాలీ నిర్వహించారు. మురుగు రోడ్లపై వదిలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువైద్యశాల, పీహెచ్‌సీ ఆవరణ, ప్రధాన రహదారిపై ఉన్న మురుగు, పిచ్చి మొక్కలను సిబ్బంది తొలగించి పారిశుద్ధ్యం మెరుగు పరిచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, స్వచ్ఛభారత్‌మండల కోఆర్డినేటర్ నాగేంద్ర, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

ఉరవకొండ: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నాయకులు ఎర్రిస్వామి, రమేష్‌బాబు, ఎల్లప్ప, రామోజీనాయుడు మాట్లాడుతూ ఈ పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గణేష్, రాజశేఖర్, మహేష్, గోవిందరాజు పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదంపై సంబరాలు

రాయదుర్గంటౌన్: పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంపై రాయదుర్గం పట్టణంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని వినాయక సర్కిల్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచారు. బీజేపీ కార్యవర్గ సభ్యురాలు వసుంధర, పట్టణ అధ్యక్షుడు అంభోజీరావు మాట్లాడుతూ నారీ శక్తి వందన్ పేరుతో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా బిల్లును పాస్ చేయడం సంతోషంగా ఉందన్నారు.